కాలో, ఇంత సుఖంగా, ఇంత ఐశ్వర్యంతో తులతూగు తున్నాముా అంటే....అదంతా ఆ చల్లని తల్లి దీవెనే! కృషి ఫలితమే! కడుపు చలవే! ఆమె కాలలో ముల్లు గుచ్చు కుంటే — నా కంట్లో గుచ్చుకున్నట్లే .... జాగ్రత్త .... ఆమె! విషయంలో ఏ పొరపాటు జరిగినా, ఏ చిన్న నిర్లక్ష్యమయినా నేను సహించలేను....''

ముల్లు నేర్పుగాతీసివేసిన తరవాతకూడా అరికాలులో బాధ తగ్గలేదు పార్వతమ్మకు, కాలు బాగా వాచిపోయింది. రామం మాటలు తమ గదిలోకి వినిపిస్తూనే ఉన్నాయి. ఆమె హృదయం గర్వంతో, ఆనందంతో నిండిపోయింది. కానీ .... కాని....

''అమ్మా! డాక్టర్‌కు ఫోన్ చేస్తాను సెప్టిక్ అవు తుందో ఏమిటో....!'' అన్నాడు రామం మళ్లీ గదిలోకి వచ్చి.

''అదే మంచిది!'' అంది సరళకూడా లోపలికివస్తూ.

విశ్వనాథంగారు ఓరగా భార్యవేపు చూశారు ''సాగితే పడమన్నారు. జారితే పడమన్నారు! నాబోటిగాడు ఊరికే పడితే, నడ్డి విరిగి పోయిందిట!'' అన్నారు నవ్వుతూ.

పార్వతమ్మ నవ్వింది. ''సాగుతూందని జరిపించు కోవటం లేదు నేను. ఇంకా ఎందుకు హడావిడి చేస్తారంతా! డాక్టర్లూ వద్దు ... ఏమీా వద్దు....ఇక ఈ గొడవ ఇంతటితో పోనిండిరా, రామం! అసలు ముల్లు బాధకంటే....'' అనేసింది.

ఎవరి దారిన వారు, ఎవరి పనులకు వారు వెళ్ళి పోయారు. పార్వతమ్మ పడుకుని ఉన్నదల్లా ఒక్కమారుగా

లేచి కూర్చొని, చేతులతో ముఖం కప్పుకుంది. ఆమె నిశ్శబ్దంగా ఏడుస్తున్నా, లోలోపల ఎగసెగసి పడుతున్న ఆమె హృదయం విశ్వనాథంగారికి తెలుసు. దగ్గరగా వెళ్ళి వెన్ను నిమిరారు. చుట్టూరా చేతులు వేసి దగ్గిరికి తీసుకున్నారు.

ఆ స్పర్శ....ముప్ఫై సంవత్సరాల క్రితం....ఇదేస్పర్శ.... ఆమెలో కోటి వీణలను శ్రుతిచేసి, మధుర రాగా లాపనకు నాంది పలికించి .... 'మరేదో కావాలి...' అన్న తియ్యటి కోరి కల్ని కోటి గొంతుకలతో వినిపించింది.

ఇరవై సంవత్సరాల క్రితం .... రామం, రవి పెరుగుతున్నప్పుడు ... ఇదే బాహువలయం .... ఇలాటి స్పర్శే మరో విధమైన అర్థాల్ని వివరించింది.

పిల్లల్ని పెంచడంలో తల్లి కెంతబాధ్యత ఉందో, తండ్రికీ అంతే బాధ్యతఉంది, పార్వతీ! అలా అనుకోకుండా ఎవంకి వారుగా ఎదటి వారిమీదకు ఆ బరువు తోసివేస్తే క్రమశిక్షణ, మనో వికాసమూ లేకుండా తయారవుతారు పిల్లలు! పెరిగిన ఆ పిల్లలు అపమార్గంలో పోతుంటే అనాడు 'నీది తప్పు నీది తప్పు' అంటూ తల్లిదండ్రులు ఒకరి నొకరు దెప్పుకోవటమంత పొరబాటు మరొకటి లేదు .... అందుచేత మనిద్దరికలలకూ, ఆదర్శాలకూ మారురూపుల్లా పెంచుదాం మనపిల్లల్ని !' అన్న దివ్య సందేశం ఆ స్పర్శలోనుండి ఉండేది!

ఈనాడు రామం వ్యాపారస్థుడుగా స్థిరపడి, లక్షాధికారిగా ఉన్నాడు. అయితేనేం తల్లిదండ్రులంటే ఏహ్యాభావం గల బిడ్డల్లా కాక, వారిని దేవతలుగా పూజిస్తున్నాడు.

రవి బి. ఇడి. ప్లానయి టీచర్‌గా పనిచేస్తున్నాడు. అయితేనేం తమకోసం ప్రాణాలు విడుస్తాడు.

ఈనాడు భర్త అలా అనునయిస్తుంటే .... ఏలాటి ఉద్విగ్నతా కలగటం లేదా స్పర్శలో ! ఏలాటి సందేశమూ నిండి లేదా స్పర్శలో !

అయితే, 'నాకు తెలుసు నీ బాధ.... ఊరుకో! మనసు సర్దుకో!, అన్న ఓదార్పు మాత్రం పుష్కలంగా ఉంది.

"రేపు మనం ఊరి కెళ్ళిపోదాం!" అంది పార్వతమ్మ కళ్ళు తుడుచుకుంటూ.

"అలాగే!" మృదువుగా అన్నారు విశ్వనాథంగారు.

తల్లిదండ్రుల నిర్ణయం విన్న రామం బాధపడ్డాడు. కోప్పడ్డాడు చిరాకుగా ఇల్లంతా కలయదిరుగుతూ అయిన దానికీ, కానిదానికీ అందరి మీదా కేకలు వేశాడు. తల్లికి నచ్చచెప్పాలని, తన దగ్గిరే వాళ్ళిద్దర్నీ ఉంచుకోవాలని శత విధాల చూశాడు

ఊహూం ! పార్వతమ్మ పట్టు వదల్లేదు,

''ఎలాగు ! కాళ్ళూ, చేతులూ పడిపోయాక మీదగ్గిరే వచ్చి ఉండాలిరా, రామం ! ఈలోగా మేమూ స్వేచ్ఛగా ఉంటాం!" అనేసింది మెల్లిగా

ట్రెయిన్‌లో కూర్చున్నాక రామం మరీ మరీ మరో మాటు చెప్పిచూసి, నిరాశచేసుకుని వెళ్ళిపోయాడు. ట్రెయిన్ కదిలాక పార్వతమ్మ హృదయం మరింతగా బరువెక్కింది.

'అమ్మా! ఇద్దరం కొడుకులమున్నాం! నా దగ్గిరుండటం ఇష్టం లేకుంటే, రవి దగ్గిరేనా ఉండండి! కానీ ... కానీ... చెట్లల్లే ఎదిగిన కొడుకు లిద్దరుండీ తల్లిదండ్రులు దిక్కు లేని వారయ్యారన్న నింద మామీద పడవేయకండి. . మీరూ దిక్కులేనివారిలా..." ఇక మాట పూర్తి చేయలేక వడివడిగా వెళ్ళిపోయిన రామం మాటలు పదే పదే ఆమె చెవుల్లో, హృదయంలో ప్రతిధ్వనించసాగాయి.

అప్రయత్నంగా ఆమె తల విదిల్చింది.

"లేదురా బాబూ, లేదు. మీ మీద నింద వేయటానికి కాదు నేను మీకు దూరంగాఉంటు. కారణం ... కారణం ఎలా చెప్పను? ఈ నా గుండెల్లో ముల్లులా ఉన్న ఆ కారణం ఎలాచెప్పను!'' ఆమె హృదయాంత రాళాల్లో ఆ సన్నని ముల్లు కొద్దిగా కదిలింది. జివ్వన బాధ ఎగసినట్లయింది, వెనువెంటనే రెండో కొడుకు రవి, అతగాడి భార్య కల్యాణి గుర్తు వచ్చారు. రామం దగ్గిరికి వచ్చే ముందు .... రవి దగ్గిర ఓ నెలరోజులున్నారు తామిద్దరూ .... గతస్మృతులామెను చుట్టుముట్టాయి....

ఉదయాన్నే లేచి హడావిడిగా ఇంటి పనులన్నీ చేసి, ఇద్దరు పిల్లల్ని ముస్తాబుచేసి స్కూలుకు పంపి, రవితోబాటు తనూ ఆఫీసుకు బయలుదేరుతుంది చిన్న కోడలు కల్యాణి! అలా వెళ్ళిన అందరూ ఇక తిరిగి రావటం సాయంత్రం అయిదున్నర దాటాకే! వచ్చినప్పటినుంచీ మళ్ళీ పిల్లల పనులు. ఇంటి పనులు, వంటతో సతమతమై పోతుంది కల్యాణి.తనకూ

చేతనైనంత సాయం చేస్తాడు రవి! కానీ ఇద్దరి కిద్దరూ అలసి పోతారు!

"ఎందుకమ్మా, కల్యాణీ. ఇంత బాధ! నువ్వు ఉద్యోగం మానెయ్యరాదూ?' అన్నది పార్వతమ్మ, కళ్యాణి ముఖంలో అలసట చూచి, జాలి నిండిన కంఠ స్వరంతో.

కల్యాణి చిరునవ్వు నవ్వింది. "ఇద్దరం సంపాదిస్తూంటేనే అంతంతమాత్రంగా ఉందత్తయ్యా! ఇక నేను ఉద్యోగం మానేస్తే ఈ సంసారం ఎలా గడవాలి! ఈ ఇద్దరు పిల్లల భవిష్యత్తేమిటి?" అంది.

నిజమే! ధరలు ఆకాశాన్నంటుతూ, జీవన ప్రమాణం ఆ ధరవరల వెనకే పరిగెత్తుతున్న ఈ రోజుల్లో .... మగాడొక్కడూ సంపాదించాలీ ఆడది ఇంటి పట్టున ఉండాలీ అంటే కుదరదు.

"పోనీ నేను ఇంటిపనులు, వంటచేస్తాను. మీ పనులు మెల్లిగా చూచుకుని మీరు ఉద్యోగాలకు వెళ్లండర్రా!" అంది మరోరోజు అనునయింపుగా.

కల్యాణి ఏదో జవాబు చెప్పబోయేలోగా, రవి అందుకున్నాడు; "వద్దమ్మా! వద్దు. ఈ రోజు నువ్వలా అలవాటు చేశావంటే, రేప్పొద్దున నువ్వు ఊరికి వెళ్లాక నా కా ఛార్జి అప్పగిస్తుంది నీ కోడలు!"

నవ్వుతూన్న భర్తకేసి ఓరగాచూచి, చిరునవ్వు నవ్వి, అత్తగారికేసి తిరిగి చూస్తూ ఫిర్యాదు చేస్తున్నట్లుగా అంది

కల్యాణి: "తప్పేముం దత్తయ్యా! ఆయన గారితో బాటు నేనూ ఉద్యోగం చేయటంలా? అలిసిపోవటంలా? ఓ పూట వంట చేస్తే తప్పేముంది? అసలు న్యాయప్రకారం చెయ్యాలి కూడాను!"

"ఇంకా నయం! ఒక పిల్లాణ్ణి నేను కన్నాను. రెండో వాణ్ణి నువ్వు కనాలి అనలేదు?" అన్నాడు రవి.

ఇద్దరి హాస పరిహాసాలూ అలా సాగుతూంటే, ఆనందంగా వాళ్లిద్దరూ జీవనయాత్ర సాగిస్తుంటే ఎంతో ముచ్చటగా ఉంటుంది పార్వతమ్మకు. కానీ....పిల్లలు ఎప్పుడేనా ఏ ఖరీదైన బట్టలో, బొమ్మలో, తినుబండారాలో కొనమని మారాం చేసినప్పుడు, తమంత తాముగా పెద్దలిద్దరూ ఏ సరదాలూ, విలాసాలూ లేకుండా కాలం వెళ్ళబుచ్చుతున్నప్పుడు, నెల తిరిగేసరికి డబ్బుకు కటకటలాడి పోతున్నప్పుడు, పార్వతమ్మ మాత్రం హృదయంలో ఏదో బాధ .... మరేదో సన్నని జ్వాల .... చిన్న ముల్లులాంటి భావన కదలాడి ఆమెను ఆ వేదనలో ముంచెత్తి వేస్తుంది .... ఆ క్షణంలోనే ఆమె హృదయంలో రాముం, అతగాడి ఐశ్వర్యం గుర్తువస్తాయి.

ఏ లోటూ లేని జీవనం, ఏ కొరతా లేకుండా తీరే కోరికలూ, ఏ క్షణంలో ఏది కావాలంటే అది అమర్చుకో గల ఆర్థిక స్థితిగతులూ రామంవి! అవి రవికి కూడా ఉండి ఉంటే ఎంత బాగుండేది? అన్న భావన ఆమెహృదయంలో బలంగా నాటుకుంది.

ఆ మటుకూ అయిదారు మార్లు రవిని కదిలించి చూసింది.

